తిరుపతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల స్థానిక సమస్యలను అధికార యంత్రాగానికి నివేదించి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార వారధిగా ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ రూపకల్పన చేసిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం నేడు తిరుపతిలో ప్రారంభం కానుంది. తొలి కార్యక్రమం తిరుపతి నగరంలో అతిపెద్ద పేదల కాలనీ అయిన జీవకోనలో జరుగుతుంది. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం వేదిక కానుంది. ఇందులో ప్రజలకు,

**తిరుపతికి జీవనాడి**

గూడులేని కార్మిక, శ్రామిక వర్గాలకు నీడ కల్పించే ఉద్దేశంతో వామపక్ష, ప్రజా సంఘాల పోరాటంతో 1980వ దశకంలో గుడిసెలు ఏర్పడ్డాయి. దీంతో జీవకోనకు పునాది పడింది. 1990 నుంచి క్రమక్రమంగా విస్తరించగా, 2020లో జీవకోన ముఖచిత్రం పూర్తిగా మారి పోయింది.






# నేడే తిరుపతి జీవకోనలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



- ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' తొలి సదస్సు
- స్థానిక సమస్యల ప్రస్తావనకు, పరిష్కారానికి వేదిక
- ప్రజలకు, అధికారులకు వారధిగా ఆంధ్రజ్యోతి
- హాజరు కానున్న తిరుపతి ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ యంత్రాంగానికీ నడుమ ఆంధ్రజ్యోతి వారధిగా నిలవనుంది. తాగునీటి కొరత, పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు, వీధి దీపాలు, పన్ను సంబంధిత సమస్యలు వంటివి ఈ సదస్సుకు హాజరయ్యే కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశముంటుంది. వివాదాలకు, రాజకీయాలకు తావు లేకుండా కేవలం సమస్యలను మాత్రమే ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్సి ఉంటుంది.ఆ ప్రాంత సమస్యలపై ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచనలు చేయాలనుకున్న వారు కూడా ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవచ్చు. స్థానికులు తెలియజేసే సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు తమ స్పందనను అప్పటికప్పుడే వెల్లడించే అవకాశముంది.

### టీడీపీ హయాంలో అభివృద్ధి

1990వ దశకం వరకు రాళ్లు, రప్పలతో ఉన్న రహదారుల ముఖచిత్రం టీడీపీ ప్రభుత్వంలో కాస్త గాడిన పడింది. ఎన్వీ ప్రసాద్ తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు 60 అడుగుల రోడ్ల నిర్మాణం జరిగింది. ఆ తర్వాత కందాటి శంకర్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అంతర్గత రోడ్లు, బోర్లు, కాలువల నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఇటీవల మేయర్ శిరీష నేతృత్వంలోని కౌన్సిల్ ప్రధాన రోడ్లను విస్తరించింది. జీవకోన ప్రాంతంలో తొలి నుంచీ అన్నా రామచంద్రయ్య కుటుంబానికి గట్టి పట్టుంది. ప్రస్తుతం ఆయన కుమార్తెలు అన్నా అనిత, అన్నా సంధ్య ఇక్కడినుంచే కార్పొరేటర్లుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

### జీవలింగేశ్వర ఆలయం

చుట్టూ కొండలు, నిత్యం జాలువారే జలపాతం మధ్య జీవలింగేశ్వర ఆలయం ఉంది. పూర్వం లోయగా ఉండే ఈ ప్రాంతంలో చెంబేడు చెట్ల మధ్య జలధార ప్రవహించే ఈ ప్రదేశంలో శివలింగాన్ని గుర్తించి.. గుడికట్టి పూజలు చేస్తున్నారు.

### 5 డివిజన్లతో..

జీవకోన పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ, సత్యనారాయణపురం, సాయి నగర్, క్రాంతినగర్, పార్వతీపురం, సంతోషమ్మ నగర్, శ్రీనగర్ కాలనీలు ఉన్నాయి. 5 డివిజన్లు కలిగిన ఈ ప్రాంతంలో 12వేలకు పైగా గృహాలు, సుమారు 60వేల జనాభా ఉన్నారు. ఇక్కడి జీవలింగేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

### నేటి ఉదయం జీవకోనలో

28న మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి నగరంలోని జీవకోనలో అంబేడ్కర్ కూడలిలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో భాగంగా సదస్సు ప్రారంభం కానుంది. ఈ సదస్సుకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య హాజరు కానున్నారు. సమస్యలను పరిష్కరించే అధికారం, అవకాశం రెండూ కలిగిన ఈ ఇద్దరి రాక వల్ల సదస్సు ఉద్దేశం నెరవేరుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. వారితో పాటు స్థానిక కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఏపీ ఎస్సీ కార్పొరేషన్ పాలకవర్గం సభ్యురాలు కుమారమ్మ, స్థానిక బీజేపీ నేత శరత్ పాల్గొంటున్నారు. తమ సమస్యలను ప్రస్తావించి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీవకోన ప్రజలను ఆంధ్రజ్యోతి కోరుతోంది.

### సెంటిమెంట్ కోన

కపిలతీర్థం సమీపాన శేషాచల కొండకు ఆనుకుని ఈశాన్యంలో ఉండే ఈప్రాంతం రాజకీయ పార్టీలకు సెంటిమెంట్‌గా మారింది. మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసినప్పుడు తొలి ప్రచార సభ జీవకోననుంచే మొదలుపెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన విజయం సాధించడంతో.. ఆతర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ జీవకోన నుంచే రాజకీయ పార్టీలు ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా మార్చేశాయి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే సెంటిమెంట్ కొనసాగింది.

## మాజీ డీసీపై క్రమశిక్షణ చర్యలు

తిరుపతి, జనవరి27(ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలలో నిబంధనలను ఉల్లంఘించారంటూ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వర్ రెడ్డిపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. ఈసీ (ఎన్నికల కమిషన్) నిబంధనలకు విరుద్ధంగా తనకు తానుగా ఈఆర్వోగా బాధ్యతలు తీసుకుని నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డట్టు బయటపడింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై అంశాల వారీగా 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు తిరుపతిలో బోగస్ ఓట్ల కుంభకోణం బయటపడటం, పలువురు అధికారులు, పోలీసులపై ఎన్నికల సంఘం వేటు వేయడం తెలిసిందే. ఉప ఎన్నికలో తిరుపతి నియోజకవర్గ ఆర్వోగా వ్యవహరించిన డీసీ చంద్రమౌళీశ్వర్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ఈఆర్వోగా విధులు నిర్వర్తించారని ప్రాథమిక విచారణలో తేలినట్టు తెలిసింది. ఈక్రమంలో బోగస్ ఓట్ల సృష్టికి అవకాశం వచ్చిందన్న ఆరోపణలను ఈసీ గుర్తించి ఆయన్ను సస్పెండు చేసింది. ఇది జరిగి దాదాపు ఏడాది దాటాక ఆయనపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది.







**ఎగిరేందుకు సిద్ధంగా నావిక్-02**

- వందో ఉపగ్రహ ప్రయోగం కావడంతో సర్వత్రా ఆసక్తి

8

## డిప్యూటీ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్

తిరుపతి, జనవరి27(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 30లోపు ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. ఫిబ్రవరి 3న పరోక్ష పద్ధతిలో ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికకు ఆర్వోగా జేసీ శుభం భన్సల్ వ్యవహరించనున్నారు. ఇద్దరు డిప్యూటీ మేయర్లు ఉండగా.. వీరిలో భూమన అభినయ్ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడంతో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ఈవిషయం గోప్యంగా ఉంచినప్పటికీ ఎన్నికల తర్వాత బయటకొచ్చింది. ఖాళీ అయిన ఆ డిప్యూటీ మేయర్ స్థానానికి ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

## చెల్లెలిపై లైంగిక వేధింపులు

- అన్నపై పోక్సో కేసు నమోదు

చంద్రగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో సొంత చెల్లెలిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో మద్యానికి బానిసైన ఓ యువకుడు మైనర్ అయిన తన చెల్లెలితో తరచూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఈ విషయాన్ని తన తల్లితండ్రులకు బాలిక చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

- జేసీ శుభం బన్సల్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 261 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జేసీ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక(పీజీఆర్ఎస్)కు 261 అర్జీలు అందాయి. అందులో ఒక రెవెన్యూశాఖకే 158 ఉన్నాయి. జేసీతో పాటు డీఆర్వో నరసింహులు, ఎస్డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్‌మండ్, పలువురు అధికారులు అర్జీలు స్వీకరించారు. వీటిలో కొన్ని..


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

### తోపుడుబండ్ల వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు


కలెక్టరేట్ వద్ద సీపీఎంతో కలిసి తోపుడు బండ్ల వ్యాపారుల నిరసన

తోపుడుబండ్లు తొలగించి చిరువ్యాపారులను మున్సిపల్ అధికారులు వేధించడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యథా స్థానాల్లో తోపుడు బండ్ల వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని జిల్లా అధికారులను కోరారు. సీఐటీయూనగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, బుజ్జి, శ్రీరాములు, నరేంద్ర, చిన్నబాబు, జ్యోయికుమార్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు కల్పించాలి

వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, చిన్నం పెంచులయ్య అధికారులను విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పనుల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. ఆ సంఘం నేతలు పెంచులయ్య, తులసీరాజన్ తదితరులు పాల్గొన్నారు.

### జయరామ చౌదరిపై కేసు పెట్టాలి

చెరకు రైతుల బకాయిలు చెల్లించని జయరామచౌదరిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో అధికారులకు ఈమె ఫిర్యాదు చేశారు. బకాయిలు అడిగే రైతులపై కేసులు పెడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం ఎంత వరకు న్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరాజు, గంగుల నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలి

ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వర్కర్లకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర తదితరులు జేసీ శుభం బన్సల్‌కు విన్నవించారు. చిన్నబాబు, సుమన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

### ఫీజుల దోపిడీని అరికట్టాలి

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు హాల్ టిక్కెట్ ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నేతలు బండి చలపతి, జాకీర్ డిమాండు చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. హరికృష్ణ, చంద్రనాయక్, ఓంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జీవకోనలో చెత్త తొలగించారు

- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

తిరుపతి(జీవకోన), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవకోనలో పేరుకున్న చెత్తను అధికారులు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

సోమవారం తొలగించారు. అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా అన్న నినాదంతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో సమస్యలకు సజీవకోన శీర్షికతో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. పారిశుధ్య లోపంపై దృష్టి సారించి చెత్తకుప్పలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


రాజీవ్‌గాంధీ కాలనీ ప్రధాన రహదారిలో తొలగించిన చెత్త

### పరిష్కార వారధిగా ఆంధ్రజ్యోతి నిలవడం అభినందనీయం



జీవకోన ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై అధికారులు, పాలకులు-ప్రజలకు మధ్య పరిష్కార వారధిగా ఆంధ్రజ్యోతి దినపత్రిక నిలవడం ఎంతో అభినందనీయం. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే తీరు హర్షణీయం.

- అన్నా సంధ్య, 49వ డివిజన్ కార్పొరేటర్

### జనస్వరంగా ఆంధ్రజ్యోతి దినపత్రిక



ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వేదికను ఏర్పాటు చేసి, ప్రజల గొంతుకగా ఆంధ్రజ్యోతి దినపత్రిక నిలవడం హర్షించదగ్గ విషయం.

- అన్నా అనిత, 48వ డివిజన్ కార్పొరేటర్

### ఆంధ్రజ్యోతితో ప్రజా సమస్యలు వెలుగులోకి



ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడంలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎల్లప్పుడూ ముందుండటం అభినందనీయం. ప్రతి నిత్యమూ ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతోంది.

- కుమారమ్మ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్

# ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

- సుభాష్ పాలేకర్ వెల్లడి


సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి చాలా మేలు జరుగుతుందని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీనివల్ల రైతుకు ఆర్థిక భారం తప్పుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అవసరం లేని వ్యవసాయ విధానాన్ని అనుసరించాలన్నారు. ఒక్క దేశవాళీ ఆవుతో 30 ఎకరాల సేద్యం చేయొచ్చన్నారు. ఈ వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సుభాష్ పాలేకర్ పరిశీలించారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ.. మళ్ళీ రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించడం ద్వారా అన్ని విధాలుగా మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు రైతులతో వర్క్‌షాప్

ప్రకృతి వ్యవసాయంపై బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో రైతులతో సుభాష్ పాలేకర్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఐదు రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులు పాల్గొంటారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు.

## ఎక్సైజ్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), జనవరి27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల కోసం కేటాయించిన 23 మద్యం దుకాణాలకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దుకాణాదారుడురూ.2లక్షలు చెల్లించాలని కోరారు. దుకాణాలు దక్కించుకున్న వారు మున్సిపాలిటీల పరిధిలో మొదటి సంవత్సరానికి రూ.21.66లక్షలు, రెండవ సంవత్సరానికి రూ.35.75 లక్షలు చెల్లించాలనివెల్లడించారు. మండలాల పరిధిలో మొదటి ఏడాది రూ.18.33, రెండవ ఏడాది రూ.30.25లక్షలు చెల్లించాలని కోరారు. దరఖాస్తుదారులు జిల్లా వాసులై ఉండాలి.



# అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి: ఈవో

తిరుచానూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి అమ్మవారి ఆలయ పరిసరాలు, పుష్కరిణి, ఉద్యానవనం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి ప్రతిరోజు 25వేలమందికి పైగా భక్తులు వస్తున్నారన్నారు. దీనికి తగ్గట్టుగా సౌకర్యాలు పెంచేవిధంగా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పీఏసీని మరో చోటుకు మార్చే ఆలోచన చేస్తున్నామన్నారు. భక్తులకు టిక్కెట్లు జారీ, లడ్డూ కౌంటర్ల వద్ద స్థలాభావం ఉందన్నారు. దీనిపై మరిన్ని మార్పులు చేస్తామన్నారు. తోళ్లప్పగార్డెన్‌లోని కల్యాణ మండపాల గురించి ఆరా తీశారు. టీటీడీ అధికారులు బాలాజీ, సత్యనారాయణ, గోవిందరాజన్, శ్రీరాముడు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం

# వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీ హెడ్ మేనేజర్ మృతి


మృతి చెందిన భాస్కర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మి నగర్‌లో వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీ హెడ్ మేనేజర్ నల్లమలుపు భాస్కరరెడ్డి మృతి చెందారు. అనారోగ్యమా.. లేదా ఆత్మహత్యకు పాల్పడ్డారా అన్నది తెలియాల్సి ఉంది. రూరల్ సీఐ చిన్నగోవింద కథనం మేరకు... ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గురువారెడ్డిపాలేనికి చెందిన భాస్కరరెడ్డికి 15 ఏళ్ల కిందట నరసారావుపేటకు చెందిన ఉదయలక్ష్మితో వివాహమైంది. వీరికి సంతానం లేదు. నరసారావుపేటలోని వల్లభ క్యాటల్ ఫీడ్ కంపెనీకి రాయలసీమ హెడ్ మేనేజర్‌గా పనిచేస్తూ ధనలక్ష్మినగర్‌లో నివాసం ఉంటున్నారు. సెలవుల్లో నరసారావుపేటలోని భార్య వద్దకు వెళ్లి వచ్చేవారు. ఆదివారం ఉదయం 8 నుంచి ఎవరు ఫోన్ చేసినా తీయలేదు. సోమవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఆ కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ప్రసన్న ఆంజనేయులు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టినా తెరవలేదు. కిటికీలో నుంచి చూడగా పడుకుని ఉన్నట్లు కనిపించారు. ఇంటి యజమానితో కలిసి తలుపులు కొట్టి చూడగా చాపపై కొద్దిగా బోర్లా పడుకుని చనిపోయాడని గుర్తించారు. ఒంగోలులోని మృతుడి అక్క లక్ష్మికి ఫోన్ చేసి చెప్పగా వాళ్లు వచ్చారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేదా అనారోగ్యంతో మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తంచేశారు. దీనిపై లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

## 6 ఏసీ బస్సుల రద్దుకు ప్రతిపాదనలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, విజయవాడ, చెన్నై, విశాఖ తిరుగుతున్న ఆరు ఏసీ బస్సులు రద్దుకానున్నాయి. మంగళం ఆర్టీసీ డిపో నష్టాలపై సోమవారం డీపీటీవో జీనరసింహులు, సీటీఎం విశ్వనాథం, డీఎం బాలాజీ సోమవారం ఉదయం సమీక్షించారు. అమరావతి కంటే ఇంద్ర బస్సుల నుంచి రాబడి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అమరావతి కంటే తక్కువ ధర కావడంతో ఇంద్ర సర్వీసులకు ఆదరణ ఉన్నట్లు గుర్తించారు. అమరావతి స్థానంలో ఇంద్ర బస్సులను నడిపితే రాబడి పెరగవచ్చని భావించారు. దీంతో హైదరాబాదు, విజయవాడ, చెన్నైలకు తిరిగే ఐదు అమరావతి.. వైజాగ్‌కు నడిచే ఓ ఇంద్ర బస్సులను రద్దు చేయాలనే నిర్ణయానికి వచ్చారు.



## 'రమాదేవి' ఆస్పత్రి వ్యవస్థాపకురాలి మృతి



తిరుపతి(వైద్యం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీరమాదేవి ఆస్పత్రి వ్యవస్థాపకురాలు, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి భార్య దేవిరెడ్డి రమాదేవి సోమవారం మృతిచెందారు. ఆస్పత్రిని స్థాపించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. ఆ స్ఫూర్తితోనే, ఆమె పెద్ద కుమారుడు డి.బి.శశిధర్‌రెడ్డి ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఆమె చిన్న కుమారుడు సత్య ప్రసాదరెడ్డి అమెరికాలో ఉంటున్నారు. కాగా, రమాదేవికి ఆస్పత్రి సిబ్బంది, ప్రముఖులు నివాళులర్పించారు. ప్రముఖ డాక్టర్లు, రాజకీయ నేతలు డాక్టర్ డి.బి.శశిధర్‌రెడ్డిని పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

- మెడికల్ కన్సల్టెంట్ నుంచి రూ7.20 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మెడికల్ కన్సల్టెంట్.. సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. ట్రేడింగ్ పేరిట రూ.7.2 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ మేరకు బాధితుడు దేశిరెడ్డి కార్తీక్ రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. సీనియర్ ఎమర్జెన్సీ మెడికల్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రూరల్ మండలం లింగేశ్వరనగర్‌కు చెందిన కార్తీక్.. ఏడాదిగా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రియాంక వేటూరి పేరిట 82375 76883 నెంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. గతేడాది నవంబరు 11న ఈయనకు అజ్ఞాత వ్యక్తి ఓబ్యాంకు లోగోతో ఫేక్ ట్రేడింగ్ లింక్ పంపారు. ఇందులో అంతర్గత ట్రేడింగ్ అకౌంటు తెరచి లాభాలు పొందవచ్చని చెప్పడంతో కార్తీక్ ఆ లింక్ క్లిక్ చేసి ట్రేడింగ్ ప్రారంభించారు. విడతలవారీగా వివిధ బ్యాంకుఖాతాలకు రూ.7.20 లక్షలు పంపారు. కార్తీక్ ట్రేడింగ్ ఖాతాలో రూ.4.42 లక్షలు లాభం వచ్చినట్లు సైబర్ నేరగాళ్లు చూపారు. మొత్తం రూ.11.62 లక్షలు ఉన్నట్లు చూపి నమ్మించారు. ఈక్రమంలో రూ.7 లక్షలు డ్రాచేసుకోవడానికి ప్రయత్నించారు. మరిన్ని డబ్బులు మీ అకౌంటుకు పంపితే కానీ మీరు ఆ మొత్తాన్ని డ్రా చేయడానికి కుదరదని చెప్పడంతో మోసపోయామని కార్తీక్ గుర్తించారు. వెబ్‌సైట్, వాట్సాప్ నెంబరు పరిశీలించగా నకిలీవని గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

## నా ఇంటిని కాపాడండి

- పీజీఆర్ఎస్‌లో బాధితురాలు శ్రీదేవి విన్నపం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం ఉన్న తన ఇంటిని కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, కాపాడాలని ఆ ప్రాంతానికి చెందిన శ్రీదేవి సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజును కలసి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 71 అర్జీలు అందాయి. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు పాల్గొన్నారు.

## ఫస్ట్‌సోర్స్ సంస్థ ఉద్యోగాలకు గేట్ కాలేజీ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులతో గేట్ కళాశాల అధ్యాపకులు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భవానీనగర్‌లోని గేట్ డిగ్రీ కళాశాలకు చెందిన 43మంది విద్యార్థులు ఫస్ట్‌సోర్స్ సంస్థ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ పేర్కొన్నారు. ఆ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ విద్యార్థులు ప్రతిభచాటి ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, చైర్‌పర్సన్ పాలడుగు విజయ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రవి, అధ్యాపకులు అభినందించారు.

## 226 రోజుల పాదయాత్ర.. 226 కొబ్బరికాయలు

- తిరుమలలో మొక్కు చెల్లించుకున్న శాప్ చైర్మన్ రవినాయుడు


అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న రవినాయుడు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు


తిరుమల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా, తండ్రిని అరెస్ట్ చేసినా ప్రజల ఆదరణ, తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతోనే నారా లోకేశ్ పాదయాత్ర దిగ్విజయంగా ముగిసిందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. లోకేశ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టి రెండేళ్లయిన నేపథ్యంలో రాయలసీమ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, తిరుపతి, తిరుమల నేతలు, యువగళం వలంటీర్లతో కలిసి రవినాయుడు సోమవారం ఉదయం తిరుమల అఖిలాండం వద్ద పాదయాత్ర 226 రోజులు సాగినందుకు గుర్తుగా 226 కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా రవినాయుడు మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం ఇదేరోజున కుప్పంలో యువగళం పాదయాత్ర మొదలైందన్నారు. 3,123 కిలోమీటర్లు సాగిన యువగళం బృందం సభ్యులుగా ఉన్న తమపై కేసులు పెట్టి జైల్లో కూడా పెట్టారన్నారు. ఆ సమయంలో యువగళం విజయవంతంగా పూర్తయితే తిరుమలకు వచ్చి కొబ్బరికాయలు సమర్పిస్తామని మొక్కుకున్నామని, ఇప్పుడు తీర్చుకున్నట్టు వివరించారు.

## ఇద్దరిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై నెల్లూరు నగరంలోని సంతపేట పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. సేకరించిన సమాచారం మేరకు, తిరుపతి జిల్లాకు చెందిన ఓ బాలిక నెల్లూరులోని ఓ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. స్కూల్ సమీపంలో ఉండే ఓ వ్యక్తి బాలికతో చనువుగా ఉండేవాడు. రెండు రోజుల కిందట ఆ వ్యక్తి బాలికను తీసుకుని రైల్వేస్టేషన్ సమీపంలో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా మరో యువకుడు రావడంతో పరారయ్యాడు. ఆ యువకుడు బాలికతో మాట్లాడి హాస్టల్‌లో వదిలిపెడతానని తనవెంట తీసుకెళ్లి ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. పాఠశాలకు వెళ్లిన బాలిక వసతి గృహానికి రాకపోవడంతో వార్డెన్ ఆమె తల్లిదండ్రులకు తెలిపారు. వారు ఈనెల 26న నెల్లూరుకు చేరుకుని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బాలిక ఆత్మకూరు బస్టాండు వద్ద ఏడుస్తూ కనిపించడంతో పోలీసులు రక్షించారు. ఏమి జరిగిందని ఆ బాలికను ఆరా తీయగా ఇద్దరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొంది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చారు.

## నేడు నగరానికి గోరక్ష మహాపాదయాత్ర

తిరుపతి(విద్య), జనవరి 27(ఆంధ్రజ్యోతి): గోరక్షణ, భూరక్షణ, దేశ రక్షణార్థం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తలపెట్టిన మహాపాదయాత్ర సోమవారం రాత్రి తిరుపతికి చేరనుంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కరకంబాడి మార్గంలోని బొంతాలమ్మ ఆలయం నుంచి అలిపిరి వరకు మహాపాదయాత్ర చేపట్టనున్నట్లు అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు, హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ గురుస్వామి తెలిపారు.



రాకెట్‌లోని మొదటి దశ



రెండో దశ



మూడో దశ



మూడు దశల అనుసంధానం అనంతరం శిఖర భాగాన అమర్చిన ఉపగ్రహం



ఇంధన ట్యాంకర్లను అమర్చుతున్న శాస్త్రవేత్తలు




అనుసంధానానికి వాహనంలో విడిభాగాలు తీసుకెళ్తున్న దృశ్యం

# ఎగిరేందుకు సిద్ధంగా నావిక్-02

- వందో ఉపగ్రహ ప్రయోగం కావడంతో సర్వత్రా ఆసక్తి
- షార్‌కు చేరుకున్న ఇస్రో చైర్మన్

శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిగేషన్ శాటిలైట్ (నావిక్-02)ను ఈనెల 29న ప్రయోగించనుంది. దేశీయ నావిగేషన్ అవసరాలకు దిక్సూచిగా ఇది తోడ్పడనుంది. పీఎస్‌ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్‌ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఇందుకోసం ఇక్కడి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. షార్ నుంచి వందో ప్రయోగం కావడంతో ఈ రాకెట్ ప్రాముఖ్యత సంతరించుకుంది. దీంతో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకొన్నారు. డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, శాస్త్రవేత్తలతో చర్చించారు. మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. 27.30 గంటల తర్వాత జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 15 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



నావిక్-02 ఉపగ్రహం



వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ తరలింపు ఇలా

**తాజా ఉపగ్రహ విశేషాలు**

- జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ పొడవు 50.9 మీటర్లు
- ఈ ఉపగ్రహం పన్నెండేళ్లపాటు రోదసీలో సేవలందిస్తుంది.
- 420.7 టన్నుల బరువుతో నింగికి బయలు దేరుతుంది.
- మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తిచేసి ప్రయోగ వేదికకు తరలించారు.
- శిఖరభాగాన ఉపగ్రహాన్ని పొందికగా అమర్చే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.
- బెంగుళూరు కేంద్రం నుంచి వచ్చిన ఉపగ్రహాన్ని క్లీన్‌రూంలో పలు తనిఖీలు నిర్వహించారు.
- హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన విభాగాన్ని రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు ఎస్ఎస్ఏబీ నుంచి వ్యాబ్‌కు తరలించి అనుసంధానించారు.
- రాకెట్‌కు రెండు స్థాయిల్లో తనిఖీలు చేసి ప్రీ కౌంట్‌డౌన్ రిహార్సల్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు.



## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



లీలామహల్ కూడలిలోని రాయల విగ్రహం వద్ద ఆర్పీఎఫ్ సభ్యులు

తిరుపతి (లీలామహల్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయల్ పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. లీలామహల్ కూడలి, ప్రకాశం పార్కుల్లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు ఆర్పీఎఫ్ సభ్యులు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పార్కు నుంచి లీలామహల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాయలవారి జయంతిని టీటీడీ అధికారికంగా నిర్వహించాలని, బలిజ భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ నాయకులు అజయ్ ప్రసన్నరాయల్, గుండాల వేణురాయల్, పవన్ రాయల్, కోట చక్రిరాయల్, సుగుణమ్మ, సూరి, సావిత్రమ్మ, హేమకుమార్ రాయల్, రత్నశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రత్నప్పకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గంగవరం మండలం ఉయ్యాలమిట్ట గ్రామానికి చెందిన రత్నప్ప కుమారుడు బాలాజీ పుట్టుకతోనే విభిన్న ప్రతిభావంతుడు. ఇటీవల నారావారిపల్లెకు వచ్చిన సీఎం చంద్రబాబుకు రత్నప్ప తన కుమారుడి పరిస్థితిని వివరించాడు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో రత్నప్పకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2లక్షల చెక్కును కలెక్టర్ వెంకటేశ్వర్ అందజేశారు.

## ఏబీవీపీ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్‌గా తరుణ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ రాష్ట్ర వర్సిటీల కో-కన్వీనర్‌గా కె.తరుణ్ నియమితులయ్యారు. విశాఖలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నారు.

## ప్రతి మండలానికీ ఆర్టీసీ బస్సులు నడపాలి

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ఎమ్మెల్యే పులివర్తి నాని డీపీటీవో జి.నరసింహులును కోరారు. డీపీటీవోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. చంద్రగిరిలో బస్టాండు, డిపో ఏర్పాటుకు సహకరించాలని కోరారు. డిపో మేనేజర్ బాలాజీ, బస్టాండు ఏటీఎం డీఆర్‌నాయుడు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. జిల్లా సాయుధ దళ విభాగంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కానిస్టేబుల్ లక్ష్మీపతి కుటుంబానికి ఆయన సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఐఆర్ నిధుల కింద రూ.లక్ష చెక్కు చెక్కును లక్ష్మీపతి భార్యకు అందజేశారు.

## రెండు దుకాణాలలో చోరీ

చంద్రగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందులవారిపల్లె, శేషాపురం గ్రామాల్లోని దుకాణాల్లో చోరీ జరిగింది. కందులవారిపల్లెలో దామోదరరెడ్డి, శేషాపురంలో వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి యథావిధిగా దుకాణాలు మూసి ఇంటికెళ్లారు. సోమవారం ఉదయం చూడగా తలుపులు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. దామోదరరెడ్డి దుకాణంలో 10 ప్లాస్టిక్ కుర్చీలు, 5 లీటర్ల సన్ ఫ్లవర్ ఆయిల్, రూ.2,500 నగదు చోరీ చేశారు. వెంకటేశ్వరరావు దుకాణంలో వ్యవసాయ బావి మోటారు, 15 లీటర్ల సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుచానూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో 132 కేవీలైన్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ చంద్రశేఖరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటేరు, కేఆర్‌నగర్, గజలక్ష్మినగర్, మార్కెట్ యార్డు వెనుకవైపు పేపర్‌కాలనీ, క్షత్రియనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## భక్తులకు పర్సు అప్పగింత

చంద్రగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు పోగొట్టుకున్న పర్సును ఆలయాధికారులు తిరిగి అప్పగించారు. హైదరాబాదుకు చెందిన సాయి మౌనిక కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనానికి సోమవారం వచ్చారు. ఆలయ ఆవరణలోని పుస్తక విక్రయశాల వద్ద పర్సును మరిచి వెళ్లిపోయారు. జమేదార్ చిరంజీవి ఆ పర్సును ఆలయాధికారులకు అప్పగించారు. పర్సులోని ఆధార్‌కార్డులో ఫోన్ నంబర్ ఆధారంగా భక్తులకు సమాచారం అందించారు. పర్సులో రూ.550 నగదు, 2.5 గ్రాముల బంగారు కమ్మలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, ఐఫోన్ ఉండటంతో పరిశీలించి, ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ భక్తులకు అప్పగించారు.

## ట్రాఫిక్ పోలీసులకు అమరరాజా వితరణ



అమరరాజా సంస్థ తరపున ట్రాఫిక్ పోలీసులకు పరికరాలు వితరణ చేస్తున్న దృశ్యం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు అమరరాజా సంస్థ సోమవారం ట్రాఫిక్ నియంత్రణ సామగ్రిని అందజేసింది. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన సేఫ్టీ బ్యాటన్లు, హెల్మెట్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, త్రీ ఎం డస్ట్ రెస్పిరేటర్లు, బారికేడు టేపులు, సేఫ్టీ గాగుల్స్ లను అందజేశారు. హెచ్ఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ నళినికుమార్, సేఫ్టీ హెడ్ వెంకటకృష్ణ కలిసి డీఎస్పీ రవిమనోహరాచారికి అందజేశారు. ట్రాఫిక్ సీఐ సంజీవకుమార్, ఎస్ఐలు విజయలక్ష్మి, బాలాజీ, అమరరాజా పీఆర్‌వో బాబ్జి, సేఫ్టీ అధికారులు లక్ష్మీపతి, త్యాగరాజులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

తిరుపతి (నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులకు సంబంధించి 11 మందికి జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. ఒక్కొక్కరికి రూ.పది వేల వంతున మొత్తం రూ.1.1 లక్షల జరిమానా విధించారు.

## 2న వివాహ పరిచయ వేదిక

తిరుపతి(వైద్యం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీవెంకట గాయత్రీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న తిరుపతి వినాయకనగర్‌లోని పాదుక మండపంలో నిత్య కల్యాణం పచ్చతోరణం పేరిట రజతోత్సవ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు శేషగిరిరావు తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వధూవరుల స్పాట్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. 10 నుంచి సాయంత్రం 5 వరకు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలను సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

**అడ్డుకున్న రెవెన్యూ అధికారులు**



ముళ్ల కంపలు తొలగించిన దృశ్యం

చంద్రగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ భూమిని 2009లో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు రైతుల భూములను స్వాధీనం చేసుకుంది. దోర్నకంబాల లెక్కదాఖలాలోని సర్వే నెంబర్ 1513-8లో 0.47 సెంట్ల భూమి కె.విజయలక్ష్మీ పేరుతో ఉంది. అర్హులకు స్థలాలు సరిపోకపోవడంతో ఆమె పేరుతో ఉన్న భూమిని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, నష్టపరిహారం చెల్లించగా, ఆమె తిరస్కరించారు. అప్పట్నుంచి ఆ భూమిని అనాధీనంగా రెవెన్యూ అధికారులు మార్చారు. అందులో కొంత ఇందిరమ్మ కాలనీ రహదారికి వినియోగించారు. మిగిలిన దాన్ని ప్రజాప్రయోజనాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వంలో దాన్ని రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌గా పొందుపరిచి, కబ్జా చేయడానికి ప్రయత్నించగా, అప్పటి విపక్ష నేతల ధర్నాతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ ఇప్పుడు కొంతమంది వ్యక్తులు రైతుకు మద్దతుగా ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ముళ్ల కంపలను తొలగించగా అధికారులు అడ్డుకున్నారు. రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు.

## మహిళా సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు వాడాలని సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రామకృష్ణమాచారి, ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## దావోస్ పర్యటనతో ఏపీకి కొత్తశకం : నాని

చంద్రగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనతో ఏపీకి కొత్తశకం ఆరంభమైందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరిలో ఆయన మాట్లాడుతూ 20 లక్షల ఉద్యోగాల కల్పనే సీఎం లక్ష్యమన్నారు. రాష్ట్రాన్ని మాజీ సీఎం జగన్ రెడ్డి బిల్డప్ ఏపీగా మార్చారని, కూటమి ప్రభుత్వం రాగానే సన్‌రైజ్ ఏపీగా మారిందని తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానిస్తున్నారన్నారు. మంత్రి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయిందని, అందులో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారని తెలిపారు. పాకాల మండలం నేంద్రగుంటలో త్వరలో 10 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

## టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు మహేష్, సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 25ఏళ్ల సమస్యకు పరిష్కారం

**విజయనవగర కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ**



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని విజయనగర కాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. 25ఏళ్ల క్రితం ఈ కాలనీ ఏర్పడిన నాటి నుంచి డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతూనే ఉన్నారు. ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే పులివర్తి నానీకి ఈ సమస్యను తెలియజేశారు. అధికారంలోకి రాగానే కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.2.80 లక్షలతో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పార్క్ ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

చంద్రగిరి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చంద్రగిరిలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజులగారి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి పుష్పలత, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యం యాదవ్, సీనియర్ నాయకులు మునిగంగిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్‌రెడ్డి, దొరస్వామి, నరేష్‌కుమార్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, మోహనరాజు, నవీన్ కుమార్ రెడ్డి, ప్రసాద్, మునెయ్య, చందేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భాకరాపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జనార్దన్ రాజు హెచ్చరించారు. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెం.1727లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత భూమిని పులిచెర్ల మండలానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకుని చదును చేశాడని నెల్లుట్లవారిపల్లెకు చెందిన గురుమూర్తి హనుమంతరెడ్డి, గుంతాటి మురళి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి ప్రభుత్వ భూమిగా తేలడంతో అందులో ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో చలపతి, వీఆర్ఏ హేమావతి పాల్గొన్నారు.

## అర్బన్ ఎక్సైజ్ సీఐకి అవార్డు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎక్సైజ్ విభాగంలో నేరాలు, అక్రమ మద్యం, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ నియంత్రణ, ప్రభుత్వ ఆదాయం పెంచడం, ప్రొటోకాల్ విధులు సక్రమంగా నిర్వహించిన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్రయ్యకు ప్రభుత్వం ఉత్తమ అధికారిగా ప్రకటించింది. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టర్ చేతుల మీదుగా ఆదివారం రాత్రి అవార్డు అందుకున్నారు.

## కమ్యూనిటీ మహల్ పరిశీలన

చంద్రగిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లె సమీపంలోని ఈద్గా మైదానంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ మహల్‌ను ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పరిశీలించారు. ఈ కమ్యూనిటీ మహల్‌ను రూ.1.60 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈద్గా స్థలంలో డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని మత పెద్దలు కోరడంతో ఎమ్మెల్యే తక్షణమే తుడా అధికారులతో మాట్లాడారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు.

## ఉచిత క్యాన్సర్ పరీక్షలు



పాకాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దినాయనిపల్లె సచివాలయంలో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో పింక్ మొబైల్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో దామలచెరువు పీహెచ్‌సీ డాక్టర్ రవిరామ్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, సర్పంచ్ కె.గిరిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి, ఎంఎల్‌హెచ్‌పీ మీనా, ఏఎన్ఎం లావణ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్య



మృతుడు శివప్రసాద్

తిరుచానూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళం రోడ్డులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథరెడ్డి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా డోన్ మండలం గుమ్మకొండ వెంకటాపురానికి చెందిన ఎం.శివప్రసాద్(19) మంగళంలోని ఎల్ఐసీ ట్రైనింగ్ సెంటర్ సమీపంలోని ఓ పీజీ హాస్టల్లో ఉంటున్నాడు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సిబ్బంది తలుపు కొట్టినా అలికిడి లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. తిరుచానూరు సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ జగన్నాథరెడ్డి అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని కిందకు దించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ నేత వెన్నెముక విరిచేశాడు!



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 27(ఆంధ్రజ్యోతి): సంవత్సరం క్రితం వైసీపీ అధికారంలో ఉన్నపుడు తమ ఊరికి చెందిన కన్నయ్యకు కొంత నగదు అప్పు ఇచ్చానని తిరిగి అప్పు అడిగితే వెన్నెముక విరిగిపోయేంత వరకు చితకబాదారని బాధితుడు మునిశేఖర్ భార్యతో కలిసి కలెక్టర్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కూడా అతనికే వత్తాసు పలికారని, ఇప్పటికీ భార్య సహకారం లేకుండా నాలుగు అడుగులు వేయలేకున్నానని చెప్పారు. జీవనోపాధి దెబ్బతిని కుటుంబం ఆర్థికంగా చిన్నాభిన్నమైందన్నారు. తనపై దాడి చేసిన కన్నయ్యపై చర్యలు తీసుకుని తనకు జీవనోపాధి కల్పించాలని అధికారుల ఎదుట మునిశేఖర్ వాపోయాడు.



### న్యాయం చేయండి... సారూ

సార్! నాది బీఎన్‌కండ్రిగ అరుంధతివాడ... మా ఊరిలోనే ప్రభుత్వ స్థలంలో చిరువ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నా... అయితే ఇటీవల నా రేకుల షెడ్‌ను సగభాగం ఆక్రమించారు... నేను దివ్యాంగుడని. నాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. మీరైనా న్యాయం చేయండి... అని అధికారులకు శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు.

## డైమండ్ జూబ్లీ జంబూరికి శ్రీకాళహస్తి స్కౌట్స్



ఎంపికైన స్కౌట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమ్మేళనానికి శ్రీకాళహస్తి స్కౌట్లు ఎంపికయ్యారు. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా మన ప్పారైలోని ఇండస్ట్రియల్ గ్రౌండ్‌లో ఈనెల 27నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు డైమండ్ జూబ్లీ జంబూరు (జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమ్మేళనం) జరగనుంది. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శరణ్‌ప్రసాద్, వెంకటమహేష్, రూపేష్, తేజ, శరవణకుమార్ శిబిరానికి తరలివెళ్లినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్‌కుమార్ తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో పలు క్లిష్టమైన విన్యాసాలపై శిక్షణ పొందనున్నారు. కాగా జిల్లా స్కౌట్ కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, యూత్ చైర్మన్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో వీరు శిక్షణ పొందుతున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



పిచ్చాటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఆదిమూలం సత్యవేడు మండలం రాజగోపాలపురానికి చెందిన భాగ్యలక్ష్మికి 40 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. అనంతరం రిపబ్లిక్‌డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్న పిచ్చాటూరు ఎంపీడీవో మహ్మద్‌రఫిని సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, ఏఎస్‌పురం ఆయకట్టు చైర్మన్ పద్దురాజు, జయచంద్రనాయుడు, వాసురెడ్డి, చిన్న, డిల్లీ పాల్గొన్నారు.

## చెరియన్ మృతికి శ్రీసిటీ ఎండీ నివాళులు





చెరియన్‌తో రవీంద్ర సన్నారెడ్డి (ఫైల్)

శ్రీసిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొట్టమొదటి విజయవంతమైన కొరోనరి ఆర్టరీ బైపాస్ గుండె మార్పిడి శస్త్రచికిత్స చేసిన ప్రముఖ హృద్రోగ వైద్యుడు కేఎం చెరియన్ మృతిపట్ల శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చెరియన్ మార్గదర్శకత్వంలో శ్రీసిటీలో 2009లో ఏర్పాటైన ఫ్రాంటీయర్ లైఫ్‌లైన్ హాస్పిటల్ తొమ్మిది సంవత్సరాలకు పైగా ఈ ప్రాంతంలోని పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించిందన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



బహిరంగ ప్రదేశాన్ని శుభ్రం చేయిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణంలోని నీలకంఠేశ్వరాలయ సమీపంలో బహిరంగ మద్యపానం జరుగుతున్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం డీఎస్పీ 1టౌన్ సీఐ గోపి, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మద్యం సీసాలను తొలగించారు. వ్యర్థాలను దహనం చేశారు. సూచికబోర్డు ఏర్పాటు చేశారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే ప్రదేశాలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులు, జీఎంఎస్‌కేలతో కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని సీఐ జయచంద్ర చేపట్టారు. ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ అబీబ్‌ఉల్లా, ఏర్పేడు పంచాయతీ కార్యదర్శి సుధాకర్, జీఎంఎస్‌కే లక్ష్మీప్రసూన, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

నాగలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ పేలి రేకులు ఇళ్లు దగ్ధమైంది. కృష్ణాపురానికి చెందిన రాజా, వనమ్మ దంపతులు అనారోగ్య సమస్యతో నగరిలోని ఆస్పత్రికి వెళ్లారు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సిలిండర్‌కు చేరాయి. అది పేలడంతో వేరుశనగకాయల మూటలు, దుస్తులకు మంటలు అంటుకున్నాయి. ఇంతలో స్థానికులు సత్యవేడు అగ్నిమాపక దళం వారికి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

# పుత్తూరు వార్తలు

## పారిశ్రామికాభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్: ఎమ్మెల్యే భానుప్రకాష్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, జనవరి27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికే సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనకు వెళ్లారని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. సోమవారం పుత్తూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్‌రెడ్డి నిర్వాకంతో పారిశ్రామికంగా రాష్ట్రం తిరోగమనం పట్టిందన్నారు. నాడు ఐటీ రంగాన్ని పరిచయం చేసిన సీఎం చంద్రబాబు నేడు ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం ద్వారా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం సీఎం, ఐటీ మంత్రి లోకేశ్ కృషి సత్ఫలితాలిచ్చాయన్నారు. దావోస్ పర్యటనతో ఒరిగిందేమీ లేదన్న పనీపాటా లేని మాజీ మంత్రి సోషల్ మీడియా వేదికగా అవాకులు చెవాకులు పేలడాన్ని తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. జగన్‌రెడ్డిలా ఇంట్లో కూర్చుని పబ్జీ ఆడుకోలేదని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్యాయం, అక్రమం, లూటీ, దౌర్జన్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మార్చారని విమర్శించారు. వలంటీర్ల పేరుతో యువతను మోసం చేశారని దుయ్యబట్టారు. గడిచిన ఐదేళ్లలో చేయలేని పనులు ఏడు నెలల్లో టీడీపీ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. రాష్ట్రంలో రూ.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు 50 కంపెనీలు సిద్ధంగా ఉండగా, వీటిలో కొన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయన్నారు.

### రూ.40 కోట్ల పెట్టుబడులు

నియోజకవర్గం పరిధిలోని ఒక్కో మండలంలో రూ.8 కోట్లతో ఐదు మండలాల్లో సిమెంట్ రోడ్లు,కాలువలు నిర్మాణం అవుతున్నాయన్నారు. ఈ వేసవిలో తాగునీటికి సమస్య లేదన్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో మూలకోన నుంచి పుత్తూరుకు తాగునీటి పంపింగ్ చేస్తామన్నారు. మరో నెల రోజుల్లో అన్నా క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, మాజీ వైస్ చైర్మన్ ప్రతాప్‌రాజు, నాయకులు ఆనంద్, డీ.ఎస్.గణేష్, భాస్కర్, ప్రసాద్, విక్కీరాయల్, బాబు పాల్గొన్నారు.

### దుస్తులు, విద్యాసామగ్రి వితరణ

ఏర్పేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిందేపల్లి ఎస్టీకాలనీలో చిన్నారులకు యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రస్టు అధ్యక్షుడు వినోద్ దుస్తులు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అరుణ, వలంటీరు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## పల్లికొండేశ్వరాలయంలో వైభవంగా ప్రదోష పూజలు



నాగలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వ రాలయంలో సోమవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధా న అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచా మృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించి ధూప, దీప, నైవే ద్యాలు సమర్పించారు. తదనంతరం నందీశ్వ రుడికి నక్షత్ర, కుంభ, మహా హారతలు చేపట్టా రు. ఈ పూజాకార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

### బోసిపోయిన ఆలయం



సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో సోమ వారం ప్రదోష పూజలు సందర్భంగా ఆలయం భక్తుల లేక బోసిపోయింది. శివుడికి విశేషమైన రోజు సోమవారం. సాధారణంగా ఆలయంలో రుద్రహోమాలు, రుద్రాభిషేకాలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భక్తులు కూడా ఆలయానికి వందల సంఖ్యలో వస్తుంటారు. అయితే సోమవారం ప్రదోష పూజ సందర్భంగా భక్తులు లేక బోసిపోయింది. గతంలో ఎన్నడూ ఈ విధంగా లేదని పలువురు చెబుతున్నారు. ఆలయ అ ధి కారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### భక్తులు లోపల... పూజారి వెలుపల



ప్రదోష పూజల్లో నందీశ్వరుడికి అభిషేకాలు, హారతి ముగిసిన తరువాత భక్తులు ఆలయంలోపలికి వెళ్లి మరగదాంబిక సమేత వాల్మీకేశ్వరుడిని, దక్షిణామూర్తిని దర్శించుకుంటారు. అయితే ఆ సమయంలో దక్షిణామూర్తి సన్నిధానంలో విధులు నిర్వహించే అర్చకుడు ఆలయం వెలుపల తిరుగుతూ తమకు తెలిసిన వారికి ప్రసాదాలు ఇప్పిస్తూ కాలక్షేపం చేశాడు. ఆలయానికి సంబంధంలేని వ్యక్తి దక్షిణామూర్తి సన్నిధిలో భక్తులకు కంకణాలు కడుతుండడంపై పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై ఈవోను వివరణ కోరడానికి ఫోన్‌ద్వారా సంప్రదించగా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## భర్తను హతమార్చిన కేసులో...

### భార్య, ప్రియుడి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పిచ్చాటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన కేసులో భార్య కేసులో నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీంద్ర తెలిపిన వివరాలు.. ఈనెల 25న మండలంలోని గజ సింహరాజపురంలో సుగంధి(30) తన ప్రియుడు అరుణ్‌రాజు(35)తో కలసి ఆమె భర్త ఆంటోని మెడకు తాడు బిగించి హత్య చేసింది. అరుణ్‌రాజు, సుగంధి గత 12 సంవత్సరాలుగా చనువుగా ఉంటున్నారు. వీరి బంధానికి ఆంటోని అడ్డు వస్తున్నాడని భావించారు. పథకం ప్రకారం 25వ తేదీ రాత్రి ఆంటోనికి పూటుగా మద్యం తాగించి ద్విచక్రవాహనంలో జీఎస్‌పురానికి సుగంధి, అరుణ్‌రాజ్ తీసుకెళ్లాడు. ప్రణాళిక ప్రకారం మద్యం మత్తులో ఉన్న ఆంటోని మెడకు అరుణ్‌రాజు, సుగంధిలు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం ఆంటోనిని చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించాలను కున్నారు. అయితే అలికిడి విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేలోగా అరుణ్‌రాజు జారుకున్నాడు. గ్రామస్తులు సుగంధిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పి పారిపోయింది. దీనిపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం నారాయణవనం మండలంలోని కైలాసకోన సమీపంలో వారిద్దరు పోలీసుల కంటపడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. తండ్రి చనిపోయి, తల్లి కటకటాల పాలవడంతో ఆ దంపతుల ముగ్గురు పిల్లలు పరిస్థితి దయనీయంగా మారింది. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐను సీఐ రవీంద్ర అభినందించారు.

## శ్రీకాళహస్తి క్షేత్రం మహిమాన్వితం



రష్యన్లతో ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి క్షేత్రం మహిమానిత్వమని రష్యన్ భక్తులు అన్నారు. ముక్కంటి ఆలయాన్ని రష్యన్ దంపతులు దర్శించుకున్నారు. ముందుగా రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్న అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ధ్వజస్తంభం వద్ద రష్యన్ భక్తులు శివనామ జపం చేశారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే సుధీర్ వారితో సాధారణ భక్తుడిలా మాటామంతి కలిపారు. తాము రష్యా నుంచి వచ్చామని యేటా శ్రీకాళహస్తి క్షేత్రాన్ని దర్శించుకుంటామని వారు తెలిపారు. పరమశివుడు కొలువైన ఈ క్షేత్రం దర్శించడాన్ని తాము ఎంతో అదృష్టంగా భావిస్తామని ఆనంద తన్మయత్వంగా పేర్కొన్నారు.

## ఢిల్లీ గణతంత్ర దినోత్సవాల్లో కేవీకే దత్తత రైతు

రేణిగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవాల్లో కేంద్ర వ్యవసాయ, రైతు మంత్రిత్వ శాఖ ఆహ్వానం మేరకు పుత్తూరు మండలం తొర్రూరు నుంచి రాస్ కృషి కేంద్రం దత్తత తీసుకున్న రైతు గజేంద్ర నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు మాట్లాడుతూ గత కొంతకాలంగా సూక్ష్మ నీటి పారుదల పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీన్ని అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడులు సాధిస్తుండడంతో ఏపీ సూక్ష్మ నీటిపారుదల యాజమాన్యం పథకం అధికారులు గజేంద్ర నాయుడి పేరును కేంద్రానికి పంపారన్నారు.

## వైభవోపేతంగా మహాశివరాత్రి ఉత్సవాలు



ఏర్పాట్ల పరిశీలనలో సుధీర్ తదితరులు

శ్రీకాళహస్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వైభవోపేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన ముక్కంటి ఆలయంలో పలు విభాగాలను పరిశీలించారు. ఆలయం మొత్తం సంచరించి ఎక్కడెక్కడ భక్తులకు అవసరమయ్యే క్యూలైన్లను ఏర్పాటు చేయాలో కసరత్తు చేశారు. అలాగే విద్యుత్, పూల అలంకరణలపై చర్చించారు. స్వామిఅమ్మవార్ల గర్భాలయాలను పరిశీలించారు. అలాగే ఆలయ పైభాగంలో ఏర్పాటు చేయాల్సిన అలంకరణల కోసం పరిశీలించారు. అనంతరం అన్నదాన కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్నప్రసాద నాణ్యతను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

రేణిగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాస్ చైల్డ్ ఫండ్, నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పరిసర గ్రామాల చిన్న పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు లతీష్‌కుమార్‌రెడ్డి, సాయితేజ, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ అర్జీలపై విచారణ షురూ



అర్జీలను పరిశీలిస్తున్న వీఆర్వో

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై వీఆర్వోలు సోమవారం నుంచి విచారణ చేపడుతున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి నివేదికలు తయారు చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించడంతో వీఆర్వోలు ఆ పనిలో పడ్డారు.

### ఉత్తమ ఎస్ఐకి సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎస్ఐగా అవార్డు అందుకున్న విశ్వనాథనాయుడిని టీడీపీ నాయకులు కార్తిక్‌నాయుడు, మునిచంద్రనాయుడు, మధునాయుడు సోమవారం పోలీసుస్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. గురువయ్య, వెంకటేశ్వర్లు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రైవేటు' రోడ్డు నిర్మాణంపై విచారణ





రోడ్డు నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

రేణిగుంట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అపార్ట్‌మెంటుకు రూ.20లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ఎంపీడీవో విష్ణుచిరంజీవి పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో కలిసి పరిశీలించారు. దీనిపై విచారణకు ఈవోపీఆర్డీ ప్రభురావును ఆదేశించారు. కాగా పంచాయతీ బోర్డు తీర్మానం కూడా లేకుండా నిర్మించిన రోడ్డుకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలో మాయమైనట్టు విమర్శలున్నాయి.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి తాలుకా క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే సుధీర్ ఆవిష్కరించారు. అదే విధంగా ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా కూడా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏపీజీ తాలుకా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### తుంబూరులో కుష్ఠువ్యాధి పరీక్షలు

నారాయణవనం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆధ్వర్యంలో గ్రామస్తులను పరీక్షించారు. సోమవారం తుంబూరులో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి చర్మంపైన నొప్పిలేని, స్పర్శలేని మచ్చలపై పరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధి పట్ల అవగాహన కల్పించారు.

### వీధిలైట్లు లేక ఇక్కట్లు



విద్యుత్ బల్బు లేని స్తంభం

ఏర్పేడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు పంచాయతీ సదాశివపురంలో వీధిదీపాలు వెలగక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గిరిజనకాలనీలకు, కందాడు గ్రామంలో వీధిలైట్లు వేశారు. కేవలం సదాశివపురానికి మాత్రం ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో పాములు సంచరిస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సదాశివపురంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

### క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నారాయణవనం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాగసుధ పేర్కొన్నారు. మండలంలోని కొండలచెరువు సచివాలయ పరిధిలో పింక్ బస్సుల ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. స్విమ్స్ డాక్టర్ చైతన్యబాను, సర్పంచు పళణిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మునివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

కేవీబీపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు తహసీల్దార్‌ను కోరుతున్నారు. ఆధార్‌లో తప్పొప్పులు సరిచేసుకోవాలంటే పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తోందంటున్నారు. గతంలో మీసేవ కేంద్రంలో ఆధార్ తప్పొప్పులు చేసేవారని ప్రస్తుతం సచివాలయాల్లో చేస్తారని చెబుతున్నా అక్కడ పనిచేయడం లేదన్నారు.


### ఇంటి స్థలాలివ్వండి

కేవీబీపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని మండలంలోని కొత్తూరుకు చెందిన 37 మంది దళితులు తమకు సోమవారం తహసీల్దారు మునిరత్నంరెడ్డికి వినతిపత్రం అందించారు. పది సంవత్సరాలుగా ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడతున్నట్టు వా పోయారు. వరలక్ష్మి, శకుంతల, సునీత, నాగమ్మ, గిరిజ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### గ్రీన్ వరల్డ్ పెయింటింగ్‌లో నారాయణ విద్యార్థిని ప్రతిభ



శ్రీకాళహస్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన గ్రీన్ వరల్డ్ పెయింటింగ్‌లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థిని జాహ్నవి ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచింది. ఏజీఎం శ్రీనివాసులు ఆ విద్యార్థినిని సోమవారం అభినందించి చెక్ అందజేశారు. ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాకెట్‌లోని మొదటి దశ



రెండో దశ



మూడో దశ



మూడు దశల అనుసంధానం అనంతరం శిఖర భాగాన అమర్చిన ఉపగ్రహం



ఇంధన ట్యాంకర్లను అమర్చుతున్న శాస్త్రవేత్తలు




అనుసంధానానికి వాహనంలో విడిభాగాలు తీసుకెళ్తున్న దృశ్యం

# ఎగిరేందుకు సిద్ధంగా నావిక్-02

- వందో ఉపగ్రహ ప్రయోగం కావడంతో సర్వత్రా ఆసక్తి
- షార్‌కు చేరుకున్న ఇస్రో ఛైర్మన్

శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ద్వారా 2,250 కిలోల బరువు కలిగిన నావిగేషన్ శాటిలైట్ (నావిక్-02)ను ఈనెల 29న ప్రయోగించనుంది. దేశీయ నావిగేషన్ అవసరాలకు దిక్సూచిగా ఇది తోడ్పడనుంది. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. ఇందుకోసం ఇక్కడి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. షార్ నుంచి వందో ప్రయోగం కావడంతో ఈ రాకెట్ ప్రాముఖ్యత సంతరించుకుంది. దీంతో ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ సోమవారం షార్‌కు చేరుకొన్నారు. డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, శాస్త్రవేత్తలతో చర్చించారు. మంగళవారం తెల్లవారుజామున 2.53 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. 27.30 గంటల తర్వాత జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



నావిక్-02 ఉపగ్రహం



వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ తరలింపు ఇలా

**తాజా ఉపగ్రహ విశేషాలు**

- జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ పొడవు 50.9 మీటర్లు
- ఈ ఉపగ్రహం పన్నెండేళ్లపాటు రోదసీలో సేవలందిస్తుంది.
- 420.7 టన్నుల బరువుతో నింగికి బయలు దేరుతుంది.
- మొదటి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తిచేసి ప్రయోగ వేదికకు తరలించారు.
- శిఖరభాగాన ఉపగ్రహాన్ని పొందికగా అమర్చే ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది.
- బెంగుళూరు కేంద్రం నుంచి వచ్చిన ఉపగ్రహాన్ని క్లీన్‌రూంలో పలు తనిఖీలు నిర్వహించారు.
- హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన విభాగాన్ని రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు ఎస్ఎస్‌పీబీ నుంచి వ్యాబ్‌కు తరలించి అనుసంధానించారు.
- రాకెట్‌కు రెండు స్థాయిల్లో తనిఖీలు చేసి ప్రీ కౌంట్‌డౌన్ రిహార్సల్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు.



## గూడూరు
### సూళ్లూరుపేట/వెంకటగిరి

## కూటమి విజయంలో యువగళం కీలకభూమిక



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకపాలనపై సమరశంఖం పూరించి మంత్రి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్రాత్మకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశాలో ఆయన మాటాడారు. యువగళం పేరుతో లోకేష్ 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 3132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు యువగళం తోడ్పాటునందించిందన్నారు. వైసీపీ అరాచకాన్ని ఎండగట్టడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. అధికారంలోకి వచ్చాక మంత్రిగా లోకేష్ హామీలను నెరవేర్చుతూ యువతకు అండగా నిలుస్తున్నారన్నారు.. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, చంద్రమౌళి, పుట్టి వెంకటేశ్వర్లు, జనార్ధన్‌రెడ్డి, సునీల్, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, శ్రీనివాసులు, గురవయ్య పాల్గొన్నారు.

## డీఆర్‌డబ్ల్యు కళాశాలలో స్పోర్ట్సమీట్ ప్రారంభం



విజేతలను అభినందిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినీలు చదువులతోపాటు క్రీడలలోనూ రాణించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. సోమవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో స్పోర్ట్సమీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలల వలన మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఒత్తిడిని అధిగమించి చదువులపై ఏకాగ్రత సాధించేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. క్రీడల వలన శారీరక దారుఢ్యం పెరగడంతోపాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను అభినందించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మెహర్మణి, ప్రిన్సిపాల్ హనుమంతరావు, డాక్టర్ రోహిణి, విద్యాసాగర్‌రావు, రవికుమార్, మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టిగా టీడీపీ సభ్యత్వాల లక్ష్యం పూర్తికి కృషి

ఓజిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాలను వేగంగా నమోదు చేసేందుకు కలిసి పనిచేద్దామని ఆపార్టీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామాల పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జిల సహకారంతో సభ్యత్వాల నమోదు లక్ష్యం చేరుకునేందుకు కృషి చేయాల్సివుందన్నారు. నాయకులతో మాట్లాడి త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

## నిబంధనలు పాటించని రియల్టర్లపై ఫిర్యాదు

కోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీ పరిధిలోని చల్లకాలువ సమీపంలో వేస్తున్న లేఅవుట్‌లకు అనుమతులు లేవని సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ పేర్కొన్నారు. లేఅవుట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె సోమవారం తెలిపారు. 8.20 ఎకరాల్లో లేఅవుట్‌ల వేసి తుడా అనుమతి మాత్రమే పొందారన్నారు. ఆ లేఅవుట్‌లు బఫర్‌జోన్‌లో ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్‌వోసి కూడా తీసుకోలేదని సర్పంచ్ తెలిపారు. ఈనేపథ్యంలో వారిపై చర్యలు తీసుకోవాలని కోరామని వివరించారు.

## ఎమ్మెల్యే తల్లి కోలుకోవాలని పూజలు

పెళ్ళకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తల్లి అమృత సరళ త్వరగా కోలుకోవాలని టీడీపీ యువనేత ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ ఆదేశాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం పెళ్ళకూరు శివాలయంలో కోట రమేష్, పైపూరు వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎక్సైజ్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల కోసం కేటాయించిన 23 మద్యం దుకాణాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి దుకాణాదారుడు రూ.2లక్షలు చెల్లించాలని కోరారు. దుకాణాలు దక్కించుకున్న వారు మున్సిపాలిటీల పరిధిలో మొదటి సంవత్సరానికి రూ.21.66లక్షలు, రెండవ సంవత్సరానికి సంబంధించి రూ.35.75 లక్షలు చెల్లించాలని వెల్లడించారు. మండలాల పరిధిలో మొదటి ఏడాది రూ.18.33, రెండవ ఏడాది రూ.30.25 లక్షలు చెల్లించాలని కోరారు. దరఖాస్తుదారులు జిల్లా వాసులై ఉండాలని తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

తిరుపతి(లీలామహల్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయల్ పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. లీలామహల్ కూడలి, ప్రకాశం పార్కుల్లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు ఆర్పీఎఫ్ సభ్యులు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పార్కు నుంచి లీలామహల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాయల వారి జయంతిని టీటీడీ అధికారికంగా నిర్వహించాలని, బలిజ భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు.

## విద్యార్థులకు నైపుణ్య శిక్షణా తరగతులు

గూడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఇంజనీర్లుగా, ఉన్నతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శిక్షణా తరగతుల కోఆర్డినేటర్ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మూడు రోజులపాటూ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. ఇమ్మానియేలు, ధనుంజయ, రాజయ్య, డాక్టర్ వేణుమాధవ్, వినయ్‌కుమార్, రామయ్య పాల్గొన్నారు.

## టౌన్‌ప్లానింగ్ అధికారికి పదోన్నతి



నాగవల్లిని అభినందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది

గూడూరు అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి నాగవల్లికి అసిస్టెంట్ సిటీప్లానింగ్ అధికారిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమెను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీను, రామన్ తదితరులు పాల్గొన్నారు.

## డిస్కం ఏఈగా మోహిని బాధ్యతల స్వీకారం



ఏఈ మోహినిని సన్మానించిన సిబ్బంది

సూళ్లూరుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ డిస్కం ఏఈగా ఆర్.మోహిని సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాపానాయుడుపేట సబ్ ఇంజినీర్‌గా ఉన్న ఈమె పదోన్నతిపై ఏఈగా సూళ్లూరుపేటకు వచ్చారు. డిస్కం కార్యాలయంలో బాధ్యతలు తీసుకొన్న ఆమెను లైన్ ఇన్‌స్పెక్టర్లు సురేంద్రకుమార్, నయాజ్, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. **కోట:** చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో జేఈగా పనిచేస్తున్న శశికళకు అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందింది. ఆమెను ఏఈగా నియమించినట్లు ఏడీఈ చిన్నయ్య తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి

కోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని నార్త్ గిరిజనకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాని సోమవారం బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు కోరారు. ఈమేరకు ఆయన సోమవారం తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణులను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ నీటి సరఫరా జరగడం లేదన్నారు. కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని రమేష్‌బాబు అధికారులను కోరారు.

## 31 నుంచి గురుదత్త హోమపూజలు

నాయుడుపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 31 నుంచి పట్టణంలో మూడు రోజులపాటు గురుదత్త హోమపూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జువ్వలపాళెంవీధిలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఇందుకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తిమ్మాజికండ్రిగ గ్రామ స్వర్ణముఖినది తీరాన గురుదత్తాత్రేయ మందిరం వద్ద హోమపూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి



డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

గూడూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో డ్రోన్‌లు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయన్నారు. డ్రోన్ టెక్నాలజీలో పట్టు సాధిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్, యశ్వంత్, కొండారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## వెంకటగిరి సమీపంలో హెలికాప్టర్ విడిభాగాల తయారీ పరిశ్రమ

- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నాయకులు బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి,మంకు ఆనంద్, జనసేన నాయకులు

వెంకటగిరి, జనవరి 27:(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి సమీపంలోని మన్నవరం సీహెచ్ఎల్ వద్ద హెలికాప్టర్ విడిభాగాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు హెలికాప్టర్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా మన్నవరం ప్రాంతంలోని బీహెచ్ఎల్ పక్కనే హెలికాప్టర్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఓ సంస్థ ఆసక్తి చూపిందన్నారు. ఈ పరిశ్రమతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాంత రూపురేఖలు మారతాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరావు, పప్పు చంద్రమౌళిరెడ్డి, మంకు ఆనంద్, బాబు నాయుడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సెంట్రల్ జైలులోనూ వైసీపీ హవా

- వైరల్ అవుతున్న ఆడియో రికార్డుపై విచారణకు ఆదేశించిన హోంమంత్రి

తడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జైలు అధికారులను సైతం వైసీపీకి చెందిన వారు ప్రలోభపెట్టినట్లు వైరల్ అవుతున్న వీడియోపై రాష్ట్రహోం మంత్రి అనిత విచారణకు ఆదేశించారు. వివరాలిలా.. 2022లో సూళ్లూరుపేటకు చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై కొందరు వైసీపీ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్పట్లో పోలీసులు ప్రధాన నిందితులను కేసులో లేకుండా చేశారు. తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరు టీడీపీ కార్యకర్తలు చికిత్స తరువాత ప్రాణాలతో బయట పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ కేసులో చలనం వచ్చింది. గత యేడాది సెప్టెంబర్ 3న అసలు నిందితులైన వైసీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు పోలీసుల అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. నిందితులు నెల్లూరు సెంట్రల్ జైలుకెళ్లినా హవా తగ్గలేదు. ఏకంగా జైలు సూపరింటెండెంట్‌నే లోబర్చుకున్నారనే విమర్శలున్నాయి. జైల్లో రిమాండ్ పనులు కాకుండా అడ్మిన్‌లో పనులు చేసేలా జైలర్లను ఒప్పించుకున్నారు. ఇటీవల వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా వీరు తమ బంధువులు జైలుకు వస్తున్నారని, వారిని అడ్మిన్‌లోనే ఉంచుకోవాలంటూ రూ.5వేలు ఫోన్‌పేలో చేస్తున్నట్లుగా ఫోన్‌కాల్ ఆడియో రికార్డు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీనిపై హోం మంత్రి విచారణకు ఆదేశించారు.

## అల్లంపాడులో భూముల రీసర్వే వేగవంతం



రైతుల సమక్షంలో సర్వే చేస్తున్న అధికారులు

కోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) అల్లంపాడు పంచాయతీలో ఐదు రోజులుగా చేస్తున్న భూముల రీసర్వే సోమవారం వేగం పుంజుకుంది. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ గోపీరెడ్డి, పలు సచివాలయాల విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు సర్వేలో పాల్గొంటున్నారు. ఇక్కడ పంచాయతీలో 851.30 ఎకరాల భూములను రీసర్వే చేస్తున్నారు. రైతుల సమక్షంలో ఆయా భూములకు సంబంధించి హద్దులు ఏర్పాటు చేస్తున్నారు.

## ఆక్వా బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్



బకాయిలు వెల్లడిస్తున్న ట్రాన్స్‌కో డీఈ నరేంద్రరెడ్డి

కోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలో ఆక్వా బకాయిలు రూ. 6.95 కోట్ల మేర ఉన్నాయని ట్రాన్స్‌కో డీఈ నరేంద్రరెడ్డి అన్నారు. బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. కోట మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం నరేంద్రరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పలు విద్యుత్ బకాయిలపై ఆరాతీశారు. విద్యానగర్, సబ్ డివిజన్‌లోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలోని పంచాయతీల ద్వారా రూ.3 కోట్లు బకాయిలున్నాయన్నారు. ఇళ్లకు సంబంధించి రూ. 40 లక్షల బకాయిలు రావాల్సి ఉందన్నారు. బకాయిలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి రాయితీలపై గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏడీఈ చిన్నయ్య, ఏఈలు ఉన్నారు.

## శ్రీసిటీలో ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ విస్తరణ





శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ శ్రీసిటీలోని తన అధునాతన లాజిస్టిక్స్ సదుపాయాన్ని సోమవారం విస్తరించింది. ఈ సందర్భంగా విచ్చేసిన చెన్నైలోని కాన్సుల్ జనరల్ మునేయా తకాహాషి, నిప్పాన్ ఎక్స్‌ప్రెస్ హోల్డింగ్స్ చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ పురో తడాహిరోలకు శ్రీసిటీ తరపున మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విస్తరణ ఎన్‌ఎక్స్ లాజిస్టిక్స్ ఇండియా మరింత నాణ్యమైన లాజిస్టిక్స్ ఇండియా మరింత నాణ్యమైన లాజిస్టిక్స్ సేవలను అందించడానికి దోహదపడుతుందని ఆయన తెలిపారు.

## విద్యార్థులకు క్రీడాపోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

గూడూరు అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ప్రగతిసేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

## 'రమాదేవి' ఆస్పత్రి వ్యవస్థాపకురాలి మృతి



రమాదేవి(ఫైల్‌ఫొటో)

తిరుపతి(వైద్యం), జనవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీరమాదేవి ఆస్పత్రి వ్యవస్థాపకురాలు, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి భార్య దేవిరెడ్డి రమాదేవి సోమవారం మృతిచెందారు. ఆస్పత్రిని స్థాపించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. ఆ స్ఫూర్తితోనే, ఆమె పెద్ద కుమారుడు డి.బి.శశిధర్‌రెడ్డి ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. కాగా, రమాదేవికి ఆస్పత్రి సిబ్బంది, ప్రముఖులు నివాళులర్పించారు. ప్రముఖ డాక్టర్లు, రాజకీయ నేతలు డాక్టర్ డి.బి.శశిధర్‌రెడ్డిని పరామర్శించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈమె చిన్న కుమారుడు సత్యప్రసాద్‌రెడ్డి అమెరికాలో ఉంటున్నారు.

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

వెంకటగిరిటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. ఎస్సై సుబ్బారావు కథనం మేరకు బాలాయపల్లి మండలం తాళ్లపల్లికి చెందిన నిడిగింటి వెంకటయ్య (57) వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్( రైటర్)గా పనిచేస్తున్నారు. సోమవారం విధులకు హాజరైన వెంకటయ్య మధ్యాహ్నం గుండెపోటుతో అస్వస్థకు గురయ్యారన్నారు. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారన్నారు. వెంకటయ్య మృతిపై సీఐ వీవీ రమణ, ఎస్సైలు సుబ్బారావు, భవాని, పోలీసు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు క్రీడాపోటీలు

గూడూరు అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ప్రగతిసేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్ల ర్యాలీ



నాయుడుపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జాతీయ ఎలక్ట్రీషియన్‌ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి బ్రాహ్మణవీధి శివాలయం వద్ద అన్నదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్‌ల పిల్లలకు ఉచిత విద్య 50 యేళ్లు నిండినవారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు.